# టేస్టులేని వేస్ట్ హాజ్బెండ్!

ఇదిగో హజ్బెండూ!... నా వద్ద తోక జాడించాలని చూడకు... కత్తిరించేస్తాను! నేను అందరిలాంటి దాన్ని కాదు. బీకేర్‌ఫుల్...' టి.వీలో ధారావాహిక సీరియల్ చూస్తూ తలపక్కకైనా తిప్పకుండా మొగుడ్ని హెచ్చరించింది చారుమతి.

ఆమాటకు కంగుతిన్నాను. అఫ్‌కోర్స్... ఇది నాకేం కొత్త కాదు. అయినా పెళ్లాం తిట్టినప్పుడల్లా గుండెలో ముల్లుగుచ్చుకున్నట్టుంటుంది. ఏం చేస్తాం?... ఏజన్మలో చేసుకున్న పాపఫలమో అని నోరు నొక్కేసుకుంటారు.

గయ్యాళి భార్యలను ఎందరినోచూశాను గానీ చారుమతి లాంటి వీరనారి నాభార్యే! ఆమెకు ఆమే సాటి నలుగురి మధ్య వున్నప్పుడు నన్ను ఏమాత్రం కించపర్చదు. వంటరిగా దొరికినప్పుడు మాటలతో తిట్లతో కాకిలా పొడిచి పొడిచి చంపుతుంది. నాగుండె గాయానికి మందే లేక విలవిల్లాడి పోతూంటాను.

అసలే మతిలేనివాడినంటూ వుంటారంతా! చారుమతిని పెళ్లి చేసుకున్న క్షణం నుండి వున్న కాస్త మతీ పోయి చచ్చింది!

చారుమతికి టమోటా చారు(రసం) అంటే చచ్చేటంత ఇష్టం! నా వంటికేమో చారు పులుసు లాంటి ద్రవపదార్థాలు పడవ్! ఊరగాయలు... నూరిన పచ్చళ్లంటే పడి చస్తాన్నేను. నాకు వేపుళ్లంటే లొట్టలేసుకుంటూ ఆబగ తినే అలవాటు. చారుమతి ససేమిరా వాటి జోలికి పోదు సరికదా నాకు ఇష్టమైన అయిటమ్స్' నన్ను తిననివ్వదు. అన్నింటికి ఆంక్షలే! చెప్పిన మాటవినకపోయినా... దానిమాట కాదన్నా కళ్లు పెద్దవి చేస్తుంది. పళ్లు నూరుతుంది తర్వాత నాపని గోవింద! వారానికో మారైనా కందిపచ్చడి తినాలని.... పొటేటో ఫ్రై.. ఆవకాయ లాంటివి భోజనంతో వుండాలని ఆరాటపడతాను. వాటి వాసన నాసికాపుటాలకు తగిలినా చాలు చారుమతి పూనకం వచ్చిన దానిలా గంగ వెర్రులెత్తుతుంది. అప్పుడు నాపని అవుటే!

ఇంట్లో వంట చేసేది నేనే అయినా నాక్కావలసినవి నన్ను చేయనివ్వదు. కనీసం దాని సరసన డైనింగ్ టేబుల్ మీద కూర్చుని భోజనం కూడా చేయవీల్లేదు. నన్నో పురుగును చూచినట్టు అసహ్యించుకుంటుంది. నన్నొక వంట మనిషి కింద జమకట్టి... అక్కడికి చారుమతే హౌస్ ఓనర్ అయినట్టు... ఆమె చేయి కడుక్కున్నాక

నన్ను తినమంటుంది. మనిషికి నా పొడగిట్టదు. భర్తననే గౌరవం బొత్తిగా లేదు.

ఇంట్లో వంట వడ్డన లాంటి చాకిరీ చేయలేక నాచావుకొస్తోంది. నా బాధ ఇంట్లో ఎవరికి చెప్పుకోను?.. తలుపులకు... కిటికీలకా?- ఏమిటో... పాపిష్టి జన్మ నన్ను నేను పెదాలు కదలకుండా తిట్టుకోవటం తప్ప దాన్నెదిరించలేక పోతున్నాను. నాదారికి తెచ్చుకోలేక పోతున్నాను.

నేను అసమర్థుడినా అనే అనుమానం నన్ను పురుగులా నిత్యం తొలుస్తూంటుంది. నా ప్రశ్నలకు ఆన్సర్స్ లేవు.

ఎంత టేస్ట్‌గా పదార్థాలు తయారు చేసినా... నన్ను..' టేస్ట్ లేని వేస్ట్ హజ్బెండ్....' అనేసి తిట్టి పోస్తూంటుంది.

అది నాకు మొగుడా?... నేను దానికి భర్తనా? ఏ పని చేసినా 'వేస్ట్ ఫెలో' అని అననిదే దానికి తృప్తి వుండదు.

ఇంట్లో కామెడీగా మాట్లాడకూడదు. సెటైర్లు నిషిద్ధం! వెటకారంకూడదు!.

'ఇదిగో నువ్వు ఆఫీసులోనే ఎం.డి! నామీద పెత్తనం చెలాయిస్తే మాటాషే...'

'అవునవును! ఇంట్లో 'బావర్చి'గాడిని... నౌకర్ని... స్వీపర్ని...' తిట్టుకున్నాను.

'మరీ అంత 'ఛీప్'గా అనుకోవలసిందేం లేదు. మనింట్లో మన పనులు మనం చేసుకుంటే తప్పేం లేదు..' సముదాయించింది చారు

అవునవుననేసి పళ్లికిలించినా... చారుమతి మాత్రం మత్తుగజంలా సోఫాకు సరిపడా కూర్చుని టీ.వీ. చూస్తూనో మొబైల్లో మాట్లాడుతూ పచార్లు చేస్తూనో... వీక్లీలు మంత్లీలు చదువుతూనో పెత్తనం చెలాయిస్తూంటుంది. అది నాకు నచ్చటం లేదు. దాన్నేమీ అన్లేని నిస్సహాయతకు నన్ను నేను నిందించుకుంటూ వుంటున్నాను.

నేను ఏ పోలీసు ఆఫీసర్‌నో అయివుంటే.. దాని నడ్డి లాఠీతో విరగ్గొడుదును. కానీ కాదే?- నన్ను చేసుకున్నాక వాళ్ల డాడీకి చెప్పి వాళ్లకున్న కంపెనీల్లో వకదానికి నన్ను ఎం.డి.ని చేసింది. ఆ కృతజ్ఞతా భావంతోనే అదేమన్నా సద్దుకుపోక తప్పటం లేదు.

చారుమతిని ఏమైనా అంటేనా ఎం.డి. పదవి హుష్ కాకే! బంగారు బాతును కోసుకు తినకూడదనే కథ మదిలో మెదుల్తూ వుంటాన నోటికి గోద్రేజ్ తాళం శాశ్వతంగా వేసేయక తప్పని పరిస్థితి.

పెళ్లి నాటికి ఎర్రగ బుర్రగ... స్లిమ్‌గా... హేండ్సమ్‌గా వుందనేసి మెళ్లో మూడు ముళ్లూ వేశాను. ఇహ అప్పటినుండి మొదలైంది నాపతనం! మొగుడి స్వాతంత్ర్యాన్ని హక్కులను నేలరాసి కాలరాయటం మొదలైంది.

చారుమతి ఒక్కటే నలుసుకావటాన అపురూపంగా పెరిగింది. పి.జి చేసింది. నన్ను పెళ్లాడింది. మొగుడిని అయిన నన్ను సర్వెంట్‌ను చేసింది. మచ్చిక చేసుకున్న కుక్క పిల్లనయ్యాను.

దాని ముఖంలో సంతోషం... మనసులో తృప్తి అనేది 'టార్చి' వేసి వెతికినా కన్పించవు. అది మితభాషి! నేనేమో వాగుడుకాయ!

ఎంతో స్లిమ్‌గ వుండే చారుమతి పెళ్లి అయిన తర్వాత ఏడాదికి పది కేజీల చొప్పున వెయిట్ పుటప్ చేస్తూ రానురాను తన కాయాన్ని తానే మోయలేక కాళ్లీడ్చుకుంటూ ఇంట్లో తిరగటం చూస్తూ నవ్వు ఆపలేకపోయేవాడిని. అందుకు బదులుగ మొహం వాచేలా చీవాట్లు తప్పలేదు.

పివ్వళ్ల బస్తాలా తయారైంది. నావర్సనాలిటీ చూచి తెగ ఈర్ష్యపడుతూంటుంది. 'ఎండు మిరపకాయ్‌లా మీరు... బూడిద గుమ్మడికాయలాగ నేన వుండటం ఏం బాగోలేదు.' అంది.

'ఉపవాసాలుండనా?-' సలహా అడిగింది

నో! ముందు.. మొగుడ్ని వేపుకు తినటం ఆపి గౌరవించటం నేర్చుకో... అందామనుకున్నాను... కానీ నోరు పెగల్లేదు

'ఉపవాసాలుంటేనే పర్సనాలిటీ 'డామేజ్' అవుతుంది. ఆకలితో మలమల మాడి నీరసించి పోతావ్... హాస్పిటల్లో ఎడ్మిట్ అవ్వక తప్పదు!... ఇవన్నీ ఎందుకొచ్చిన హెడేక్ గానీ... నీది 'ఒబేసిటి' తిన్నా తినకున్నా పూరిపోతునే వుంటావ్ గాలి బెలూన్‌లా... అంచేత నాకు మల్లే వేపుడు కర్రీస్ తిన్నావంటే సన్నబడతావ్...' నాకు తోచించింది చెప్పాను.

'అయినా మీ బోడి సలహా ఎవరిక్కావాలి?..' అంది.

శోభనం నాటిరాత్రే గదిలో వుంచిన అన్ని రకాల స్వీట్సు చారుమతి వక్కతే మెక్కటం చూచి విస్తుపోయాను. ఇదేం బకాసుర తిండిరా బాబూ అనుకున్నాను.

అప్పుడే అన్పించింది చారుమతొక తిండిబోతని. బైట మనిషిని వంటకు పెట్టుకుంటే దిష్టి తగుల్తుందేమోని నన్ను వంట వాడిగా చేసేసింది. దాని తెలివికి హేట్సాఫ్! అడ్డమైన చెడ్డపనలన్నీ తాను చేస్తూ నన్ను వేస్ట్‌ఫెలో అంటూ తిట్టిపోస్తుంది.

పెళ్లినాడు పురోహితుడు దాని చేత నామెళ్లో తాళి కట్టించటానికి బదులు నా చేత దాని మెళ్లోకట్టించి పొరపాటు చేశాడు.

ఇంట్లో పెత్తనమంతా చారుమతిదే! పేరుకే నేను కంపెనీకి ఎం.డి!- రోజూ నా పాకెట్‌మనీ కింద ఓ పాతిక చేతిలో పెట్టి 'దీన్తో సద్దుకోండి! కేంటీన్లో ఏమీ తినకండి. లేడీ స్టాఫ్ వైపు కన్నెత్తి చూడకండి...' రోజూ అష్టోత్రం తప్పనిసరి! నాకు వళ్లుమండి 'ఏంటీ బిచ్చమా?' అన్నాను. ఆమాట అన్నందుకు చారుమతి మండిపడి నాచేతిలో పాతిక రక్కునలాక్కుని 'ఇదీ దండగే!... కార్లోవెళ్లి... ఏ.సి ఛాంబర్లో కూర్చునే మీకు పాకెట్‌మనీ దేనికి?-' వాత పెట్టింది.

× × × × ×

నా సంతోషం... పెళ్లి చేసుకున్నాననే ముచ్చట మూడో రోజే నాలో మాయమైనయ్!- నాలైఫ్ 'కిచన్'కే అంకితమైంది! ఏజన్మలో ఏం పాపం చేసుకున్నానో... ఆ దేవుడు నాకు ఇలాంటి శిక్ష విధించాడు అని వాపోని క్షణం కళ్లనీళ్లు పెట్టుకొని రోజంట లేదు.

నిద్రలేవ గానే చారుమతికి బెడ్ కాఫీ... తర్వాత బ్రష్‌మీద పేస్ట్‌లేసి ఆమెగారి పాచి పళ్లు తోమటం... అలిగినా... నీలిగినా.. బ్రతిమాలి బాత్‌రూమ్‌లో స్నానం చేయించి వళ్లు తుడవటం... బ్రతిమాలి... బామాలి ముద్దుగ బ్రేక్‌ఫాస్ట్ తిన్పించటం.. అలవాటైంది నాకు.

నేను నొసలు చిట్లిస్తే అది గుడ్లురుముతుంది. నా పని అవుట్. వికెట్ పడటంతో వెనుదిరిగిన బాట్స్‌మెన్‌లా వుంటుంది నాఫేస్.

మొగుడితో అన్ని వన్లూ చేయించుకోవటంతో గొప్ప 'థ్రిల్' వుంటుందంటుంది. దీనికిదేం టెస్టో?

'డార్లింగ్ ఛారూ! నన్ను టు-ఇన్-వన్‌లా వాడుకోకు! ఇంటా బైట చాకిరీ చేసి చేసి వళ్లు హూనమౌతోంది' అనేశాను ధైర్యం చేసి.

అందుకు బదులుగా నన్ను కౌగలించుకుని కిస్ఇస్తుందేమో అనుకున్నాను. ప్రత్యామ్నాయంగ నా చెంప ఛెళ్లు మన్పించింది.

దాని సాహసానికి బిత్తరపోయాను. ఇది లిమిట్స్ ఎక్సీడయింది. అనేసి కోపంతో వూగిపోయినా ఏమీ చేయలేని నిస్సహాయత నన్ను పాతాళంలోకి నెట్టేయటంతో కిమ్మన్లేదు.

'భర్త అనేవాడు అన్ని పన్లూ చెయ్యాలి! ఇది చెయ్యను... అది చేతకాదు అనటానికి వీల్లేదు. అద్సరే... నేను వోవర్ సైజని... సెకండ్ సెటప్పేదైనా పెట్టావా.. ఈ మధ్య ఆఫీసు నుంచి రావటం లేటవుతోంది...' మాటల కొరడాతో కొట్టింది.

'నాబతుక్కి అదొక్కటే తక్కువ' గుడ్ల నీరు కుక్కుకున్నాను.

'నాకైతే అనుమానంగానే వుంది! ఈ మధ్య నాతో కలిసి పడుకోవటం లేదంటే నా'డౌట్' కరెక్ట్ అయివుండాలి..'

'ఏడ్చినట్టయింది. అసలు కారణమేమంటే మన డబుల్ కాట్ నీకొక్క దానికే చాలటం లేదు. పైగా నువ్వు పెట్టే గురకతో నిద్రకు భంగం వాటిల్లుతోంది. అదీ కాక ... నువ్వు కాళ్లూ చేతులు నామీద వేయటం మూలాన ఏ.సీ. రూమ్‌లో వున్నా... చెమటకు తట్టుకోలేక నేను వేరే గదిలోకి షిఫ్ట్ అయ్యానంతే! బిలీవ్ మీ!!-'

'అంతేనంటావా?-'

'తప్పదు. నువ్ నమ్మి తీరాల్సిందే- లేకపోతే నేను వురేసుకు చావాల్సిందే....' బావురుమన్నాను.

'నిజమా?-'

'నన్నపార్థం చేసుకుని ఆడిపోసుకోకే చారూ... ఇదిగో నన్ను వేస్ట్‌ఫెలో అనటం మానవే... నీకు పుణ్యముంటుంది... చెట్టంత మగాడిని.. నీ మొగుడ్ని నన్నిలా వేపుకు తినటం ఏంబాగోలేదే....'

'నీకు టెక్కు ఎక్కువ! పెళ్లి నాటికి నీకు జాబ్‌లేదని తెలిసీ మా డాడీ నీకు పాతిక లక్షల డౌరీ ఇచ్చాడు. అరడజను సూట్లు కుట్టించాడు. పది తులాలు పెట్టి నీకు మెడలోకి గోల్డ్ ఛైన్ చేయించి ఇచ్చాడు... నాలుగు తులాల బ్రాసిలెట్ పెట్టాడు. తర్వాత కంపెనీకి ఎం.డీ.ని చేశాడు. అయినా నేనంటే నీకు చిన్న చూపు. అది గ్రహించే నిన్ను దూరంగా వుంచాను. నిన్ను 'హెరేస్' చేయనారంభించాను. ఇప్పటికైనా

నీలో వున్న 'మేల్‌ఈగో'ని తరిమెయ్! అప్పుడునువ్ చెప్పినట్టు వింటాను. నీకు సంపూర్ణ స్వాతంత్ర్ర లభిస్తుంది.- అండ్రస్టాండ్....'

'యస్ డియర్... డార్లింగ్ చారు... ఐయామ్ సారీ! నా గురించి అంచనా వేయటంలో ఎక్కడో పొరపాటు జరిగింది. అందుకే నాపట్ల ద్వేషం పెంచుకుని నన్ను 'కుక్కు'ని కుక్కని చేశావ్. నువ్వెంత అవమానించినా... కష్టాలపాలు చేస్తున్నా హేపీగా భరిస్తూ వచ్చాను. బిలీవ్ మీ!- నేను మిడిల్ క్లాస్ ఫెలోని! నువ్వు కోటీశ్వరుడి డాటర్‌వి! డబ్బుందనే అహం నాకు దగ్గర కానీకుండా నిన్ను అనుక్షణం ప్రతి ఘటించి వుంటోదన్పించింది- నేన్నీ భర్తను. నువ్వు అపాయింట్ చేసుకున్న 'సర్వెంట్‌ని' వంట చేసిపెట్టే బావర్చీ గాడిని కాదు. మనిద్దరం హైలీ ఎడ్యుకేటెడ్ అయివుండి మన సంసారాన్ని, హేపీ హోం చేసుకోలేకపోతున్నందుకు ఐఫీల్ సారీ...'

'అయినా సరే... నిన్ను 'వేస్ట్ ఫెలో' అననిదే నాకు తృప్తి వుండదు డియర్- అది నేన్నీకిచ్చిన ముద్దు పిలుపు...'

'నేను మంచి టేస్ట్ వున్న భర్తను చారూ...' ఇద్దరం ఏకమైనామ్!!

ఇలా ఇద్దరం దగ్గరవాలంటే రోజుకో పదిసార్లైనా నేన్నీకు 'భర్త'ను అనే వాస్తవవాన్ని గుర్తు చేస్తే గాని నన్ను గ్రహించదు. నన్ను కరుణించదు!!

(సమాప్తం)